క్లుప్తంగా

కాలినడకన ఆలయానికి చేరిన భక్తులు



మేడూరు(గంపలగూడెం): మండలంలో మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి ఆంజనేయస్వామి భక్తులు శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం కాలినడకన వెళ్లారు. గంపలగూడెం రామాలయం వద్ద నుంచి భక్తులు వీరాంజనేయుని జెండాలను చేతబూని ఐదు కిలోమీటర్ల దూరం కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. స్వామి విశేష పూజలో పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసేందుకు అతిథి అధ్యాపకుల నియామకం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా కళాశాల ఆఫీసులో తమ దరఖాస్తులను అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆరుద్ర జయంతి

పెనుగొలను(గంపలగూడెం): మండలం పెనుగొలనులో గురువారం ప్రముఖ అభ్యుదయ కవి ఆరుద్ర జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గేయ, కథ, వ్యాస, నవల, సినిమా పాటల రచయితగా, విమర్శకుడు, పరిశోధకుడు, నాటక కర్త, అనువాదకుడు, సంపాదకుడిగా వివిధ సాహిత్య రంగాల్లో ఆరుద్ర రాణించారని పలువురు కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, కళా ప్రపూర్ణ బిరుదు పొందారని వివరించారు. ఉపాధ్యాయులు పి.రవికుమార్, నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముసునూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెక్కపల్లికి చెందిన మానికల నాగరాజు (26)ను ఆగస్టు 14న తండ్రి మేకలు, గొర్రెలను మేతకు తీసుకువెళ్లాలని చెప్పాడు. ఈ పని ఇష్టం లేక నాగరాజు కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని విజయవాడ జనరల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వీరులపాడు: ఎదుగుదల లోపించి మొక్కజొన్న పంట ఎండిపోతుండగా పత్తిలో తామర పురుగు, నల్లి తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి అధికంగా ఉందని గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు మధువాణి, కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని బోడవాడ, తాటిగుమ్మి, జుజ్జూరు, చెన్నారావుపాలెం గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను జిల్లా వ్యవసాయాధికారి నాగమణిమ్మతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లరేగడి భూముల్లో సాగు చేసిన మొక్కజొన్నకు 13-0-45 ఒక శాతం వారం రోజుల వ్యవధిలో సుమారు మూడు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేయడం ద్వారా బెట్ట పరిస్థితుల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. పత్తిలో పసుపు, బ్లూ రంగు జిగురు అట్టలను ఎకరాకు 10 చొప్పున పంట ఎత్తులో ఏర్పాటు చేయటం ద్వారా రసం పీల్చు పురుగును నివారించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో జోగేంద్ర ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాంకేతికను అందిపుచ్చుకోవాలి

పెనుగంచిప్రోలు: విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ఇప్పుడు వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు గురువారం సైన్స్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన విద్యావిధానం, తరగతి కేంద్ర మూల్యాంకనంపై రిసోర్స్ పర్సన్ ముక్కా సత్యనారాయణ, సైన్స్ ప్రాజెక్టులను ఐదు గురు విద్యార్థులను ఎంపిక చేసి ఐదు ప్రాజెక్టులను అప్లోడ్ చేయాలని మరో రిసోర్స్ పర్సన్ జె.సదానంద్ వివరించారు. రాబోయే రోజుల్లో పరీక్షలు, ప్రశ్నలు ఎలా ఉండాలో, ఉంటాయో యూట్యూబ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ కె.జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు

- మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్
- తోలుకోడులో గడప గడపకు మన ప్రభుత్వం

తోలుకోడు(మైలవరం): గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తలపెట్టారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని తోలుకోడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం గడప గడపకు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహింస్తోందన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ, అధికారులకు తగు ఆదేశాలిస్తూ ఎమ్మెల్యే ప్రజల్లో తిరిగారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తోలుకోడులో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రేపు మహానేత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

- సేవా కార్యక్రమాలు నిర్వహించాలి
- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ఉమ్మడి ఏపీలో సంక్షేమ పథకాల అమలుకు పునాదులు వేసిన మహానేత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులకు గురువారం పిలుపునిచ్చారు. ప్రజల గుండెల్లో చెరగని సంతకం వైఎస్సార్ అని, పేదల సంక్షేమానికి పునాదులు వేసిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు వైఎస్ తనయుడు ముఖ్యమంత్రి జగన్ తండ్రి బాటలోనే ప్రయాణిస్తూ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే వెలంపల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను ఇటీవల కాలంలో జిల్లా స్థాయి పార్టీ పదవులు పొందిన కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్రకొండ గురవయ్య, జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్య వెల్లంపల్లిని కలిసి శాలువాతో సత్కరించారు. రానున్న ఎన్నికలకు జిల్లా స్థాయిలో పార్టీ క్యాడర్‌ను సిద్ధంచేసి జగనన్న విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వార్డు కౌన్సిలర్లు బాడిశ నాగరాజ కుమారి, అడపా వెంకయ్యనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో వెలంపల్లి శ్రీనివాస్‌ను కలిసిన కొండపల్లి వైఎస్సార్ సీపీ నేతలు

వక్తృత్వ పోటీలో విద్యార్థిని ప్రతిభ

మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పసుపులేటి దామినీ సరయు జిల్లా స్థాయిలో వక్తృత్వ పోటీలో తృతీయ బహుమతి సాధించిన సందర్భంగా గురువారం కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో తమ కళాశాలకు చెందిన పసుపులేటి దామిని సరయు పాల్గొందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సరళకుమారి తెలిపారు. ప్రభుత్వం అందజేసిన ప్రశంసా పత్రాన్ని విద్యార్థులు, సిబ్బంది సమక్షంలో విద్యార్థినికి అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది సహకారంతో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్చి 23న పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరళకుమారి

స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన

నూజివీడు (ఆగిరిపల్లి): స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు విద్యార్థుల భద్రత విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరి చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని స్కూల్ బస్సుల డ్రైవర్లకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులను క్షేమంగా వారి ఇంటి వద్ద దిగబెట్టడం ప్రాథమిక విధి అని అన్నారు. పరిమితికి మించి విద్యార్థులను స్కూల్ బస్సులలో ఎక్కించొద్దని, పిల్లలు చేతులు బయటకు పెట్టకుండా స్కూల్ బస్సులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సులను నడపొద్దని, తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని సూచించారు, భద్రతా చర్యల లోపాల కారణంగా ప్రమాదం సంభవిస్తే డ్రైవర్, క్లీనర్లతో పాటు సంబంధిత స్కూల్ యాజమాన్యంపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు స్కూల్ బస్సుల డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నంబూరి చంటిబాబు

ఆరోగ్య రక్షణకు పోషకాహారం అవసరం



మైలవరం: ఆరోగ్య రక్షణకు పోషకాహారం తీసుకోవాలని డాక్టర్ కోలా విజయశేఖర్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కోలా విజయశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. మన భోజనంలో ప్రధానంగా అన్ని రకాల పోషకాలు ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ వ్యాయామం సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరమన్నారు. విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా నేర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్స్, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు (ఆగిరిపల్లి): స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని అధికారులు తెలిపారు.

జేవీవీ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



తిరువూరు మండల జేవీవీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

తోటమూల(గంపలగూడెం): ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచటానికి కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు బలపడాల్సిన అవసరం ఉందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ అన్నారు. తోటమూలలో గురువారం జరిగిన జేవీవీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూఢ నమ్మకాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో వాటి నియంత్రణకు ప్రభుత్వం చట్టం రూపొందించాలన్నారు. జేవీవీ మండల అధ్యక్షుడిగా కె.శేషగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.సైదులు, కోశాధికారిగా పి.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేవీవీ చెకుముకి రాష్ట్ర కన్వీనర్ ఎం.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక తిరువూరు మండల కమిటీకి కొత్త కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎం.సుధాకర్, డీ సుదర్శన్, గౌరవాధ్యక్షులుగా ఆర్. నాగేంద్రబాబు, కే నరసింహారావు, బీజే సుందరరావు, పీ శీనయ్య, కోశాధికారిగా సుబానీ, సమతా కన్వీనర్‌గా ఎస్.ఉషారాణి, 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

మెట్టగుట్ట/పెనుగొలను(గంపలగూడెం): శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీశేషాచల శ్రీనివాసుని గిరి ప్రదక్షిణ ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో మొదటిసారిగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు కోలాహలంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు తూమాటి యోగానందచార్యులు, శ్యామసుందరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు సంప్రదాయబద్ధంగా జరిపారు. విష్వక్సేన పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. అంకురార్పణ, కంకణధారణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశేషాచల శ్రీనివాసమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి చత్ర, ఛామర, మంగళ వాయిద్యాలతో భక్తులు గిరిప్రదక్షిణను అట్టహాసంగా నిర్వహించారు. గోవిందనామం పలుకుతూ భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ కొండచుట్టూ ప్రదక్షిణ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ గోగూల మూడి శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షులు జొన్నల ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మెట్టగుట్ట వద్ద శేషాచల శ్రీనివాసమూర్తి గిరి ప్రదక్షిణ

కనులవిందుగా కల్యాణ మహోత్సవాలు



నెమలిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తిరువూరులో వేంకటాచలస్వామి మాసకల్యాణం

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం స్వామి మాసకల్యాణం కనులవిందుగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే రుక్మిణీదేవి, సత్యభామ సమేత శ్రీవేణుమాధవుని కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 9మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. వివాహ ఘట్టాలను, విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. భక్తులు విశేషంగా స్వామి కల్యాణాన్ని తిలకించారు.

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా గురువారం మాసకల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు, సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. అనంతరం గరుడసేవ నిర్వహించారు.

సోదరీమణులకు పెద్దన్నలా నిలిచిన జగనన్న

- మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్
- ఘనంగా రాఖీ పౌర్ణమి

మైలవరం: సోదరీమణులకు ముఖ్యమంత్రి జగన్ పెద్దన్నలా, అన్ని పథకాలు మహిళల పేరుతో అమలు చేస్తూ వారికి రక్షణ కవచంలా నిలిచారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయతలు, అనురాగాలకు, ప్రేమానుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింప జేసేదే రాఖీ పండుగ అన్నారు. కుటుంబ బంధాలు, రక్త సంబంధాలల్లోని ఔన్నత్యాన్ని, మానవ సంబంధాల్లోని పరమార్థాన్ని తెలుపుతుందన్నారు. ఒకే కడుపున పుట్టకపోయినా తనను ఓ అన్నగా భావించి ఆదరిస్తున్న మైలవరం నియోజకవర్గ సోదరీమణులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన పాఠశాలలో..

మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో రాఖీ పండుగను గిరిజన విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బాలికలు తాము స్వయంగా రాఖీలు తయారు చేసి బాలుర చేతులకు కట్టడం విశేషం. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్..

గంపలగూడెం: రాఖీపౌర్ణమి పండుగను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. సోదర, సోదరీమణుల మధ్య అనురాగం ఆప్యాయతలను కనపరిస్తూ ఆడబిడ్డలు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి తమకు జీవితాంతం తోడునీడగా ఉండాలంటూ ఆశీర్వాదం పొందారు. తోబుట్టువులకు అన్నదమ్ములు పసుపు కుంకుమలను అందజేశారు. ఆడబిడ్డల రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

చాట్రాయి: అక్కా అన్నా చెల్లి తమ్ముళ్ల అనురాగాలు ఆప్యాయతలు ఒకరికి ఒకరు పంచుకునే రాఖీ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కలు, చెల్లెళ్లు ఉదయాన్నే తమ తమ పుట్టినింటికి వెళ్లి తమ్ముళ్లకు, అన్నలకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రాఖీలు కట్టిన అక్కలకు చెల్లెళ్లలకు సంప్రదాయకంగా నూతన వస్త్రాలు బహూకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాఖీ షాపులు, స్వీటు, పూల షాపులు కిటకిటలాడాయి. పల్లెల్లో ఆడపడుచులతో సందడి నెలకొంది.

తిరువూరు: రక్షాబంధన్ కార్యక్రమాన్ని తిరువూరు మండలంలో గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు దూరప్రాంతాల నుంచి సైతం వచ్చిన ఆడపడుచులతో సందడి నెలకొంది. రాఖీలు, మిఠాయి దుకాణాలలో రద్దీ నెలకొంది. పాఠశాలల్లో రాఖీ పండుగ విశిష్టతను తెలుపుతూ విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. పలు దేవాలయాల్లో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కేతనకొండ ఎంపీటీసీ సభ్యులు కొమ్మూరు రామకోటేశ్వరరావు (బాల)కు ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి రాఖీ కట్టారు. కాగా మైలవరం నియోజకవర్గం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు ఇబ్రహీంపట్నం వార్డ్ కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి రాఖీ కట్టి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.



తిరువూరు సిద్ధార్థ స్కూలులో రక్షాబంధన్ కార్యక్రమంలో విద్యార్థులు



బాలకు రాఖీ కడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీదేవి



మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు

ఘనంగా వడ్డెర విమోచన దినోత్సవం

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు గ్రామంలో వడ్డెర సంఘ నాయకులు బత్తుల మంగయ్య, గంజి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం వడ్డెర విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మైనింగ్‌కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు వడ్డెర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డెరలు కొన్ని రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీల జాబితాలో ఉండగా మన రాష్ట్రంలో బీసీ–ఏగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మన రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బత్తుల నరసింహారావు, వేముల నరసింహారావు, ఉప్పుతోళ్ల నాగార్జున, గంజి గోపి, సాంబయ్య, తమ్మిశెట్టి డేవిడ్, బండారు రాంబాబు, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వడ్డెర విమోచన దినోత్సవంలో నాయకులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు సాయం

మైలవరం: ఇంజినీరింగ్‌లో ప్రతి విభాగంలో మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చెక్కును అందజేశారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు గురువారం ప్రారంభించారు. ముందుగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకి రెడ్డి బాలిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులు ప్రారంభించారు. చైర్మన్ ప్రసాదరెడ్డి తల్లి సరస్వతి పేరున ఈ చెక్కులను అందజేశారు. కళాశాల కో ఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. కళాశాల ప్రసిడెంట్ జీ. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ సతీమణి బేబీరాణి, కే.తిమ్మారెడ్డి, ఎల్‌బీఆర్‌సీఈ ట్రస్టీలు గోగులమూడి సత్యనారాయణరెడ్డి, కుదుముల వెంకట్రామిరెడ్డి, యందూరి సాంబశివరావు, డీన్స్, ఆయా విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ ప్రసాదరెడ్డి, పక్కన ప్రసిడెంట్ శ్రీనివాసరెడ్డి

ఇద్దరికి గాయాలు

చాట్రాయి: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మండలంలోని జయపురం గ్రామానికి చెందిన మల్లూరి గోవిందరావు గురువారం తన ద్విచక్రవాహనంపై జయపురం నుంచి తుమ్మగూడెం వెళ్తుండగా ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన గొడవటి వెంకయ్య ద్విచక్రవాహనాలు జయపురం–తుమ్మగూడెం గ్రామాల మధ్య ఢీకొన్నాయి. గోవిందరావుకు తీవ్రగాయాలు అవగా,వెంకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఆటోలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు.